# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

April / ఏప్రిల్-2025

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేధ్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : **101** April / ఏప్రియల్–**2025** No./ సంచిక : **4**



| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన– కందాడై రామానుజాచార్య శ్రీహరివంశము | 2 |
| 2. | ధ్యానము – అద్వైత తారావళి | 4 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : బొప్పన అరుణాదేవి | 5 |
| 4. | గీతాంజలి – రవీంద్రనాథ్ ఠాగూర్ | 7 |
| 5. | ఆత్మవికాసము మనస్సుపై ఆధారపడియుండును – శ్రీ రామకృష్ణ పరమహంస | 8 |
| 6. | నిద్ర – స్వామి సచ్చిదానంద | 9 |
| 7. | నీటిబుడగ – రచన కాటంరెడ్డి సత్యనారాయణ | 13 |
| 8. | మానసోల్లాసము – శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 14 |
| 9. | గురువాచకకోవై – వివరణ సాయికృష్ణ | 17 |
| 10. | సుఖం ఇవ్వదు – మలిశెట్టి రంగారావు (బన్ను) | 20 |
| 11. | ఆనంద రామాయణము – పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద | 21 |
| 12. | కార్యక్రమములు – విరాళములు | 27 |


**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/– లు సాలుసరి రూ. 100/–**



# ప్రార్థన

## శ్రీరామచరిత మానసము

**శ్లో॥ మృగేన్ద్రత్వంచ లోకేషు సర్వసత్త్వేషువా విభో**
**గాయన్తి త్వాంచ మునయో మృగేన్ద్ర ఇతి నిత్యశః**
**త్వత్ప్రసాదాత్ స్వకంస్థానం ప్రతిపన్నాస్స్మవై విభో**

**తా॥** విభూ! నీవు అన్ని ప్రాణులలో మృగేన్ద్రత్వమును పొందిన నిన్ను మునులు మృగేన్ద్రుడు అని గానము చేసెదరు. నీ అనుగ్రహము వలన మేము మామా స్థానములను పొందితిమి.

**శ్లో॥ ఏవముక్తో దేవసంఘైః నరసింహో మహామనాః**
**బ్రహ్మాచ పరమప్రీతో విష్ణో స్తోత్రముదైరయత్**

**తా॥** దేవతలు ఇట్లు పలుకగా నారసింహుడు ప్రసన్నుడాయెను. పరమ ప్రీతి చెందిన బ్రహ్మ విష్ణుస్తుతిని చేసెను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికెను.

**శ్లో॥ భవనాక్షరమవ్యక్తం అచిన్త్యం గుహ్యముత్తమమ్**
**కూటస్థమకృతం కర్తృ సనాతన మనామయమ్**

**తా॥** తాము అక్షరము అవ్యక్తము అచిన్త్యము పరమరహస్యము ఉత్తముడవు కూటస్థుడవు. తమకు కర్త ఎవ్వరూ లేరు. తాము అందరికీ కర్త. రోగాదులు లేని సనాతనుడవు.

**శ్లో॥ సాంఖ్యయేరేచయా బుద్ధిస్తత్త్వార్థ పరినిష్ఠితా**
**తాం భవిన్వేద విద్యాత్మా పురుషశ్శాశ్వతోధ్రువః**

**తా॥** సాంఖ్య యోగమున తత్త్వార్థి నిష్ఠబుద్ధిని తాము తెలియుదురు. తాము జ్ఞానస్వరూపియైన అన్తర్యామి. సనాతనుడవు. ధ్రువుడవైన పరమాత్మవు.

**శ్లో॥ త్వం వ్యక్తశ్చ తథావ్యక్తః త్వత్తస్సర్వమిదం జగత్**
**భవన్మయా వయం దేవ భవానాత్మా భవాన్ప్రభుః**

**తా॥** వ్యక్తము నీవే. అవ్యక్తము నీవే. ఈ జగత్తు నీనుండియే ఆవిర్భవించినది. మేమంతా తమ స్వరూపమే. నీవే ఆత్మవు. నీవే ప్రభువు.

**శ్లో॥ చతుర్విభక్త మూర్తిస్త్వం సర్వలోక విభుర్గురుః**
**చతుర్యుగ సహస్రేణ సర్వలోకాన్తకాన్తకః**

**తా॥** నీవు విశ్వతైజస ప్రాజ్ఞ తురీయముల నాలుగు భేదములు కలవాడవు. తాము సకల లోకములకు ప్రభువువు. గురువువు. నాలుగు వేల యుగములకొకసారి సకల లోకములను అన్తము చేయు కాలస్వరూపుడవు.

**శ్లో॥ ప్రతిష్ఠా సర్వభూతానాం అనన్తబల పౌరుషః**
**కపిల ప్రభృతీనాంచ యతీనాం పరమాగతః**

**తా॥** సకల భూతములకు ప్రతిష్ఠ నీవే. అనన్తబల పౌరుషము కలవాడవు. కపిల ప్రభృతి యతులకు నీవే పరమగతివి.

**శ్లో॥ అనాది మధ్య నిధన! సర్వాత్మా పురుషోత్తమ!**
**స్రష్టాత్వం త్వంచ సహర్తా త్వమేకో లోకభావనః**

**తా॥** ఆదిమధ్యాన్తములు లేనివాడవు. సర్వస్వరూపుడవు. పురుషోత్తముడవు. సృష్టించునది నీవే. సంహరించునది నీవే. సకల జగత్తును పాలించునదీ నీవే.

**శ్లో॥ భవాన్ బ్రహ్మాచ రుద్రశ్చ మహేన్ద్రో వరుణో యమః**
**భవాన్కర్తా వికర్తాచ లోకానాం ప్రభురవ్యయః**

**తా॥** నీవే బ్రహ్మవు రుద్రునివి మహేన్ద్రునివి వరుణునిని యుయడవు. తాము కర్తవు వికర్తవు. లోకములకు ప్రభువువు నాశములేనివాడవు.

**శ్లో॥ పరాంచ సిద్ధిం పరమచం దేవం-పరంచ మన్త్రం పరమం మనశ్చ**
**పరంచ ధర్మం పరమం యశశ్చ-త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** నీవు పరమసిద్ధివి. నీవే పరమదేవునివి. పరమమన్త్రము నీవే. పరమ మన్త్రము పరమ మనస్సు. పరమ ధర్మము నీవే. పరమ యశస్సు నీవే. నీవే ఆదిశ్రేష్ఠుడవు. పురాణపురుషుడవు అని పెద్దలు చెప్పుచున్నారు.

**శ్లో॥ పరం శరీరం పరమంచ ధామ-పరంచ యోగం పరమాంచ వాణీమ్**
**పరం రహస్యం పరమాం గతించ-త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** తామే ఉత్తమ శరీరము. పరమధామము నీవే. పరమయోగము నీవే. పరమవాక్కువు నీవే. పరమ రహస్యము పరమగతివి నీవే. నీవే సర్వశ్రేష్ఠుడవైన పురాణ పురుషుడవని పండితులు చెప్పుచుందురు.

**శ్లో॥ పరంచ సత్యం పరమం హవిశ్చ-పరం పవిత్రం పరమం చ మార్గమ్**
**పరంచ హోత్రం పరమం చ యజ్ఞమ్-త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** తాము పరమసత్యము పరమ హవిస్సు. పరమ పవిత్రము పరమమార్గము



తామే. పరమ యజ్ఞము పరమహోత్రము తామే. నీవే సర్వశ్రేష్ఠుడవు. పురాణ పురుషుడవని విద్వాంసులు చెప్పుచున్నారు.

**శ్లో॥ పరం పరస్యాపి పరంచ యత్పరం - పరం పరస్యాపి పరంచ దేవమ్**
**పరంపరస్యాపి పరం ప్రభుం చ - త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** పరముకంటే పరము నీవే. పరాత్పరతత్త్వము నీవే. పరమునకు పరమువు, పరదైవము తామే. పరమునకు పరము పరమప్రభువువు నీవే. నీవే సర్వశ్రేష్ఠుడవు. పురాణపురుషుడవని విద్వాంసులు చెప్పుచున్నారు.

**శ్లో॥ పరం పరస్యాపి పరం ప్రధానం-పరం పరస్యాపి పరంచ తత్త్వమ్**
**పరం పరస్యాపి పరంచ ధాతా-త్వా మాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** నీవు పరముకంటే పరమువు. ఉత్తమ ప్రధానమువు. పరమునకు కూడా పరము. పరతత్త్వము. పరమునకు కూడా పరము. పరమధాతవు. సర్వశ్రేష్ఠుడవైన పురాణ పురుషుడవు నీవే అని పండితులు చెప్పుచున్నారు.

**శ్లో॥ పరం పరస్యాపి పరం రహస్యం - పరం పరస్యాపి పరం పరంయత్**
**పరం పరస్యాపి పరం తపోయత్ - త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** పరమునకు పరమువు, పరమరహస్యమువు పరముకంటే పరమ పరమువు. పరము కంటే పరమ తపస్సువు. నీవే సర్వశ్రేష్ఠుడవు అయిన పురాణ పురుషునిగా పెద్దలు చెప్పుచుందురు.

**శ్లో॥ పరం పరస్యాపి పరం పరాయణం - పరంచ గుహ్యంచ పరంచ ధామ**
**పరంచ యోగం పరమం ప్రభుత్వం - త్వామాహురగ్ర్యం పురుషం పురాణమ్**

**తా॥** పరమునకు పరము. పరమ పరాయణము. పరమ రహస్యము. పరమ ధామము. పరమయోగము. పరమప్రభుత్వము. నీవు సర్వశ్రేష్ఠుడవైన పురాణ పురుషుడవు అని పండితులు చెప్పుచుందురు.

## ధ్యానము

**శ్లో॥ కబలిత చఞ్చలచేతో-గురుతర మణ్డూక జాలపరితోషా।**
**శేతే హృదయగుహాయాం - చిరతర మేకైవ చిన్మయీ భుజగే॥**

**తా॥** కప్పలను కడుపునిండుగా మెసవి, సుఖముగా శయనించి యున్న సర్పమువలె-గంతులిడుచున్న మానసిక వృత్తులనన్నిటిని ఆహరించి, హృదయ గుహ యందొంటిగా చిత్స్వరూపము చిరతర నైశ్చల్యముతో విరాజిల్లుచున్నది.

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాయి) **అధ్యాయం - 58**

## శాంతి ఆశ్రమములో సేవా కార్యక్రమాలు

మనము కూడా ఏదో ఒకరోజు తొందరగానో, ఆలస్యంగానో ముసలివార మవుతాము. మనము కూడా ఒకరోజు అదే పడవలో వృద్ధులతో కలిసి ప్రయాణించాల్సి ఉంటుందని గుర్తు పెట్టుకొని దాని గురించి జాగ్రత్తగా ఆలోచించాలి. వారి సంరక్షణ గురించి, భవిష్యత్తు గురించి ఏమయినా చేయగల్గితే అది మనకు సంతృప్తిని, సౌకర్యాన్ని కల్గిస్తుంది. మన వృద్ధ సోదరసోదరీమణులు కూడా భగవంతుని బిడ్డలే కదా!

ఆశ్రమానికి వృద్ధులయిన పెద్దలు ఎప్పుడూ వస్తుంటారు. చెందుర్తికి చెందిన మాతృమూర్తి సూరమ్మ ఆశ్రమము ప్రారంభంలో మాతో కలిసి నివసించిన భక్తురాలు, ఇప్పుడు ఎనభై ఏళ్ళ వృద్ధురాలయింది. నా మనస్సులో ఒక బలమయిన నిర్ణయం ఏర్పడింది వృద్ధాశ్రమం నిర్మించాలని. ఆశ్రమానికి పెద్దగా మూలధనం లేదు. ఆలోచన వచ్చింది కనుక నేనిప్పుడు రెండు కుందేళ్ళ వెనుక పరుగెత్తాల్సి ఉంటుంది. చాలా వాటి వెనుక పరుగెత్తాలి. అయినప్పటికి అది నాకు సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది. ఇప్పుడు నేను నాటిన విత్తనము తప్పకుండా మొలకెత్తి, పెద్ద వృక్షంగా ఒక నాటికి మారుతుంది. ప్రత్యేకంగా మనము వాటిని చక్కగా నీరుపోసి పోషించ వలసి ఉంటుంది.

మనము ఏదో ఒక్క బీజాన్నే నాటాలని అనుకోకూడదు. మన శాంతి ఆశ్రమము పొలాల్లో వరి పండిస్తున్నాము. అలాగే మొక్కజొన్న, మినుములు, పెసలు, కందులు ఇంకా వేరుశనగ కూడా పండిస్తున్నాము. అందువలన ఏ విత్తనాలు నాటామో ఆయా ఫలాలు వాటికి అనుకూలమయిన వాతావరణంలో ఫలిస్తాయి. అదే విధంగా ఆశ్రమములో గురుకులానికి, ముద్రణాలయానికి, ఇంకా ఎన్నోమంచి పనులకు బీజం వేశాము. ఇప్పుడిక వృద్ధాశ్రమం స్థాపించడానికి బీజము వేయడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ఈరోజు మాత్రమే మనది, రేపటి గురించి నేను ఆలోచించను. అందువలన మంచి పనులు వెంటనే ఈ రోజు ప్రారంభించాలి. ఫలితాన్ని మాత్రము పరమాత్మకు వదిలిపెట్టాలి.

ఈ భౌతికదేహము ప్రపంచాన్ని వదిలిపెట్టి ఈ రోజే వెళ్ళిపోయినా లేదా ఏదో ఒకరోజు వెళ్ళిపోయినా మనము నాటిన విత్తనాలు తప్పకుండా ఎవరో ఒక



ఆత్మజ్ఞానుల ద్వారా పోషింపబడి పేదలకి, నిస్సహాయులకు మహోన్నతమయిన సహాయకారిగా ఆంధ్రదేశంలోనే కాకుండా భారతదేశంలోనే గొప్ప సేవలందిస్తాయి. మంచి దృఢమైన, ఆరోగ్యవంతమయిన వారిని ఎవరయినా సంరక్షిస్తారు. కాని రోగులను, పేదలను, వృద్ధులను, నిస్సహాయులను జాగ్రత్తగా సంరక్షించడానికి పవిత్రమయిన హృదయం గల భక్తులు కావాలి. భగవంతుడు పేదవారి రూపంలో, వృద్ధుల రూపంలో మన వద్దకు వస్తాడని చెపుతారు. వారిని జాగ్రత్తగా సంరక్షించి, పూజించటం, ప్రేమతో, అనురాగంతో చూసుకోవటం మనకు దొరికిన మంచి అవకాశం. ఈ ప్రపంచమంతా భగవంతుని స్వరూపమే అయినప్పుడు భగవంతుని బిడ్డల్లో అట్టడుగు వాటికి సేవచేసినా ఆ పరమాత్ముడిని సేవించినట్లే అవుతుంది. ఆశ్రమంలో దాదాపు నలభై సంవత్సరాల నుండి కొందరు సోదర సోదరీమణులు శాంతి ఆశ్రమం కోసం ఎందరికో ఎన్నో సేవలను అందిస్తున్నారు. వారిలో చాలామంది ఇప్పుడు వృద్ధులయిపోయి, ఎలాంటి పనులు చేసుకోలేకపోతున్నారు. వారిలో ఒక సోదరుడి కంటిచూపు పోయింది. ఇంకొక వ్యక్తికి చెముడు వచ్చింది. ఇంకొక సోదరి క్రొత్తగా ఆశ్రమానికి వచ్చింది. ఆమె ఒంటరిది, నిస్సహాయురాలు, కనీసం నడవలేని స్థితిలో ఉంది. వీరందరికి మనము ఏమి చేయగలము? వాళ్ళు ఆశ్రమానికి ఎలాంటి సహాయము చేయలేని స్థితిలో ఉన్నారని ఇప్పుడు వారిని నిర్లక్ష్యంగా బయటికి పంపివేస్తే అది పాపము కదా! వారిని ప్రేమతో, చిరునవ్వుతో ఆదరించటం, జాగ్రత్తగా సంరక్షించడం మన బాధ్యత. ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నవారికంటే వీరి పట్ల ఇంకా ఎక్కువ శ్రద్ధ పెట్టవలసిన అవసరముంది. వారి అవసరాలను వారే సమకూర్చుకోగలవారిని ఎవరయినా ప్రేమగా గౌరవంగా చూస్తారు. కాని ఎవరయితే రోజువారి అవసరాలు కూడా తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారో వారిని కూడా మనము ప్రేమతో సేవించాలి. ఇదే నిజమయిన గొప్ప సేవ. భగవంతుడు మన జీవితంలో అందించిన గొప్ప అవకాశము. ఈ ప్రపంచంలో ఎవ్వరూ కూడా నిరుపయోగం కాదు, వారు యవ్వనంలో ఉన్న లేదా వృద్ధులయినా సరే, ప్రతి ఒక్కరూ భగవంతుని దివ్యలీలతో పాత్ర వహించవలసిందే.

ఈ వృద్ధులయిన సోదరసోదరీమణులు ఆశ్రమానికి ఎంతో గొప్పసేవ చేస్తున్నారని చెప్పాలి. వారు ప్రపంచశాంతి నిరంతరం భగవన్నామాన్ని జపిస్తుంటారు. వ్యక్తులకు, దేశాలకి కూడా శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకోవటం కంటే గొప్ప సేవ ఇంకేముంటుంది? శాంతి ఆశ్రమంలో 'ఏకాహం' భగవంతుని పవిత్ర నామజపము నిరంతరాయంగా రోజంతా జరుగుతుంటుంది. మన వృద్ధులు అందులో రెండు

మూడు గంటలు పాలుపంచుకుంటారు. పదే పదే భగవన్నామాన్ని జపించటము వలన వారు పరమాత్మతో మమైకం అవుతారు. అంతేకాక భగవన్నామాన్ని శ్రవణం చేసేవారికి కూడా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. వారు అలా భగవన్నామాన్ని పాడుతున్నప్పుడు మనము వ్యక్తిగతంగా అనుభవించాలే తప్ప మాటల్లో వర్ణించి చెప్పలేము.

అయినా, మన జీవితంలో వృద్ధులకి, నిస్సహాయులకు, రోగులకి, దేవుని బిడ్డలందరికీ, అవసరమయిన వారందరికి సహాయ సహకారాలు అందించటం మన కర్తవ్యం.

**ఓం...ఓం..ఓం...**

## గీతాంజలి

రవీంద్రనాథ్ ఠాగూర్

నీకు రంగు రంగుల బొమ్మలు తెచ్చి ఇచ్చినప్పుడు నాకర్థమవుతుంది, నా పాపా, మేఘాలపైనా, నీటి పైనా, ఇన్ని రంగులెందుకు నాట్యమాడతాయో, ఎన్నో చిన్నెలతో పువ్వు లెందుకు చిత్రిక మౌతాయో, నీకు రంగుబొమ్మల నిచ్చినప్పుడు నాకు తెలుస్తుంది.

నిన్ను చిందులు తొక్కించేందుకు నేను పాడినప్పుడు నాకు సరిగా తెలుస్తుంది. ఆకుల్లో సంగీతమెందుకుందో చెవియొగ్గి వినే భూ హృదయానికి తమ కంఠరవాల్ని అలలు ఎందుకు వినిపిస్తాయో నువ్వు నాట్యమాడడానికి నేను పాడినప్పుడు నాకర్థమౌతుంది.

ఆశతో చాచిన నీ చేతులకి నేను మధురభక్ష్యాల్ని అందించినప్పుడు నాకు తెలుస్తుంది. పుష్ప పాత్రలో తేనె ఎందుకు దాక్కొనివుంటుందో, మధుర రసం పళ్ళల్లో రహస్యంగా ఎందుకు నిండిఉందో, ఆశకొన్న నీ చేతులకి మిఠాయి తెచ్చి ఇచ్చినప్పుడు తెలుస్తుంది.

నిన్ను చిరునవ్వించాలని నీ ముఖాన్ని ముద్దుపెట్టుకున్నప్పుడు, కన్నా, నాకు నిశ్చయంగా తెలుస్తుంది. ఉదయ కాంతిలో ఆకాశం నుంచి దొర్లి ప్రవహించే ఆనందమేమిటో, ఎండాకాలపు గాలి నా వొంటికి తెచ్చే సౌఖ్య మేమిటో, నిన్ను చిరునవ్వించడానికి నిన్ను ముద్దుపెట్టుకున్నప్పుడు నాకు తెలుస్తుంది.



# ఆత్మవికాసము మనసుపై నాధారపడియుండును.

**-రామకృష్ణ పరమహంస**

ఆత్మవికాసము మనఃస్థితిపైనను భావములపైనను ఆధారపడియుండును. వికాసము హృదయము వలన గలుగవలయునుగాని ఏ బాహ్యకర్మముల వలనను గలుగదు. ఇద్దఱు స్నేహితులు భాగవతకాలక్షేపము జరుగు తావునకు సమీపము నుండి పోవుచుండిరి. అందొకడు, “అదిగో అచటికి బోయి కొంచెముసేపు పురాణమును విందము” అనెను. రెండవవాడు, “ఎందుకోయి! భాగవతమును వినిన నేమి లాభము? భోగమువాండ్ర యింటికి బోయి హాయిగా గాలక్షేపము చేయుదము” అనెను. మొదటివాడందులకు సమ్మతింపక భాగవత కాలక్షేపము జరుగుచోటికే వెడలెను. రెండవవాడు భోగముదాని యింటికి బోయెనుగాని, తానాశించిన యానందమును గనజాలకపోయెను. అందుచే దనలో దానిట్లను కొనసాగెను: “అయ్యో! నేనిక్కడికేల వచ్చినాను? శ్రీహరిలీలలను వినుచు నాస్నేహితుడెంత హాయిగా గాలక్షేపము చేయుచుండునో కదా!” ఇట్లాతడు తాను అపవిత్రస్థలమున నుండియు హరిని గూర్చియే ధ్యానించెను. రెండవవాడో, భాగవత శ్రవణము చేయుచును గూడ అందానందము గలజాలక తన్ను దానిట్లు నిందించుకొన సాగెను: “ఆహా! ఎంత బుద్ధిహీనుడను! మిత్రునితో గూడ భోగముదాని యింటికి బోయి సుఖమనుభవింపనైతినే! అతడెంత హాయిగా గాలక్షేపము చేయుచుండునో కదా!” ఇట్లీతడు భాగవతము పఠింపబడు తావున గూర్చుండెనన్న పేరేకాని, “చిత్తము శివునిమీద, భక్తి చెప్పులమీద” అనునట్లు వీని మనసంతయు భోగముదాని యింటిమీదనే యుండెను. ఇట్లు వీని మనస్సు అపవిత్ర సంకల్పములతో మలినమైయుండుటవలన, స్వయముగా లంజెయింటికి బోకపోయినను పాపమునే పొందినాడు. ఇక భోగముదాని యింటికి బోయినవాడో, స్వయముగా తాను అపవిత్ర స్థలమున నున్నను వాని మనస్సంతయు భాగవత కాలక్షేపము మీదనే యుండుట వలన భాగవత శ్రవణము చేసిన పుణ్యమును బడసెను.

# నిద్ర

**-స్వామి సచ్చిదానంద ఆనందాశ్రమము**

**రాము :** ప్రియమయిన నిద్రగారూ! నేను కోరినా కోరకపోయినా మీరు నావద్దకు వస్తున్నారు గనుక; నా సాహచర్యమును ఆనందంగా అనుభవిస్తున్నట్లు కనిపిస్తారు.

**నిద్ర :** నాకు ఎవరిమీద మక్కువలేదు. బలహీనంగా ఉన్న లేక విశ్రాంతి అవసరమయిన దేహమునకు కేవలం విశ్రాంతినిస్తున్నాను.

**రాము :** కానీ భగవన్నామగానంలోనూ భజన చేయటంలోను నేను బాగా చురుకుగా నిమగ్నుడనై ఉన్నపుడు గూడ నీవు వచ్చి నన్ను విసిగిస్తావు.

**నిద్ర :** అది ఎందుకంటే-భజనలోను సంకీర్తనంలోను చురుకుగా నీవు పాల్గొన వలెనని అనుకున్నప్పటికీ నామంతోను భజనయొక్క భావంతోను నీ మనస్సును అనుసంధాన పఱచజాలకున్నావు. నామం పట్ల నీ ప్రేమ, భగవంతుని యెడల నీ భక్తి ఆయనలో నీ మనస్సును లయం చేయించగలిగినంత నిర్మలం చేయబడలేదు. అది నామజపం వలన కొంచెం ప్రశాంతమయినపుడు దానికి సులభమయిన తమస్సు లోనికి జారిపోయే స్వభావం ఉంటుంది లేక సత్త్వంలోనికి అతీతంగాను పైకిపోయే ప్రవృత్తీ ఉంటుంది, దానికి అధికమయిన నైర్మల్యం కావాలి.

**రాము :** నామనస్థితి ఎట్టిదయినా నీవు ఎందుకు దూరంగా ఉండవు?

**నిద్ర :** అది సాధ్యంకాదు. మనస్సు ప్రశాంతంగా ఉండి భగవద్భావనలో లీనం కానపుడు, పయికి పోగలిగినంత నిర్మలంగా లేనపుడు నేను దాని విషయమై జాగ్రత్త తీసికోవాలి.

**రాము :** అయితే నేను ఏమిచేయాలి?

**నిద్ర :** నీ మనస్సును నిర్మలం గావించటానికై ఎక్కువ తీవ్రమయిన సాధన చేసి ఎక్కువగా ఊర్ధ్వగమనం గావించటానికి నిన్ను నీవు సన్నద్ధుని చేసికోవాలి. మొదట కావలసినది ఏమంటే-భగవంతుని సాక్షాత్కరింపజేసికొనటానికి తీవ్రమయిన ఆకాంక్ష. అపుడు మాత్రమే నిర్మలీకరణం జరుగుతుంది.

**రాము :** నేను నీ అభిప్రాయము అర్థం చేసికొనగలను. కానీ నిన్ను ఎంతగానో కోరుకొని నీ సన్నిధికై ప్రార్థించే వారివద్దకు ప్రత్యేకించి వృద్ధులవద్దకు, రోగులవద్దకు నీవు ఎందుకు వెళ్ళవు? నీవు వారి యెడల చాలా క్రూరంగా ఉన్నట్లు కనిపిస్తావు.

**నిద్ర :** నేను క్రూరుడను గాను, నేను వారి వద్దకూపోతాను, కానీ వారి చింతలు,



చికాకులు నన్ను వారి దరిజేరనీయవు. నేను అసహాయుడను. అయినప్పటికీ సాధ్యమయినంత వఱకు నేను వారికి సాయపడటానికి ప్రయత్నిస్తాను.

**రాము :** అపుడు వారు ఏమిచేయాలి?

**నిద్ర :** పడుకొనబోయేటప్పుడు వారు భగవన్నామ జపం ద్వారా తమ మనస్సును ప్రశాంతం గావించి కొన్ని నిమిషాలసేపు ధ్యానించాలి. ఈ అభ్యాసం వారిని ప్రశాంతులను జేసి నేను వారిని చేరటం సులువు గావిస్తుంది.

**రాము :** నీవు నీ సన్నిధితో ప్రతివ్యక్తినీ ధన్యం చేయవలెనన్నది సంపూర్ణంగా అవసరమా?

**నిద్ర :** అవును. ఆహారం పూర్తిగా ఆవశ్యకమయినట్లే నా సన్నిధిగూడ ఆవశ్యకమే.

**రాము :** నీవు వెళ్ళకపోతే ఏమవుతుంది.

**నిద్ర :** వారు కొన్నిరోజులవఱకు నిరంతరం నన్ను పోగొట్టుకుంటే ఆరోగ్యం కోల్పోతారు.

**రాము :** అది ప్రతివ్యక్తికీ అన్వయిస్తుందా?

**నిద్ర :** కొన్ని మినహాయింపులున్నాయి. తీవ్రమయిన సాధన చేసేవారిని, వారు నన్ను కోరుకుంటే తప్ప, నేను సమీపింపజాలను. తమ భగవదున్మాదం వలన వారు నన్ను కోరరు. ఏ యితరమయిన ఉన్మాదం ఆ స్థితిని కలిగింపజాలదు.

**రాము :** అది హానికరము కాదా?

**నిద్ర :** కాదు. భగవద్భావనలో లీనులయిన వారు ఆయన నుండి శక్తిని పొందుతారు. అందువలన వారు ఎక్కువ ఆరోగ్యవంతులుగా, ఎక్కువ సంతుష్టులుగా ఉంటారు.

**రాము :** నిన్ను కలవటానికి సాధారణంగా ప్రయత్నం ఆవశ్యకం కాదని నేను గమనించియున్నాను; కానీ మనస్సును ఎక్కువ ఆరోగ్యవంతుల్లాగా, ఎక్కువ సంతుష్టులుగా ఉంటారు.

**నిద్ర :** ఒక సామ్యమేమంటే-రెండు సందర్భాలలోను దేహభావన ఉండదు. మనస్సు ఎక్కువపయికి పోయేటపుడు ఎఱుక ఉంటుంది, అది సత్త్వగుణంలో ఉంటుంది. తద్భిన్నంగా నిద్రలో తమస్సు మాత్రమే ఉంటుంది, ఎఱుక ఉండదు.

**రాము :** కాబట్టి ఒకటి రెండవదానికి విరుద్ధం!

**నిద్ర :** అవును. "మూర్ఖుడు నిద్రిస్తాడు, మూర్ఖుడుగా మేల్కొంటాడు, మూర్ఖుడు

సమాధిలోనికి పోతాడు, జ్ఞానిగా తిరిగివస్తాడు" అన్నంతగా భేదముంటుందని కూడ చెబుతారు. దీనిభావమేమనగా–నిద్రలో మార్పు జరుగదు, సమాధిలో అజ్ఞానం నశిస్తుంది. ఇది నిర్వికల్పసమాధి, తక్కువ రకపు సమాధి కాదు.

**రాము :** గంటల తరబడి చాలకాలం ధ్యానంలో కూర్చున్నవారు ధ్యానం నుండి బయటకు వచ్చినపుడు మారుతారని దాని భావమా?

**నిద్ర :** కాదు. ఏవిధమయిన మార్పులేకుండా భగవద్భావనలోను, ఒకే విధమయిన సమాధిలోను గూడ వారు నిమగ్నులై గంటల తరబడి కూర్చొనవచ్చు. అయినప్పటికీ, మనోనిశ్చలత్వం నుండి లభించిన శాంతిని వారు అనుభవిస్తూ ఉంటారు. ఇంకను ఎక్కువ పురోగతిని సాధించటానికి అటువంటి దైనందినాభ్యాసాలు ఆవశ్యకం. నిర్వికల్ప సమాధిని చేరినవారు మాత్రమే సంపూర్ణమయిన మార్పును పొందుతారు.

**రాము :** వేళకానివేళలో మేము నీచే ఆక్రమింపబడినపుడు ఏమిచేయాలి?

**నిద్ర :** నిలబడి దేహమును క్రియాశీలం చేయటం వలన నీవు నన్ను తప్పించు కొనవచ్చు. నీవు ఎప్పుడూ అతిగా తినవద్దు. సాత్త్వికాహారమును మాత్రమే, అదిగూడ ప్రత్యేకంగా రాత్రిపూట చాలా తేలికయినది తీసికో, బరువయిన ఆహారం వెంటనే నన్ను ఆహ్వానిస్తుంది. తగిన వ్యాయామంతో నీవు నీ దేహమును గూడ ఆరోగ్యవంతం గాను, సముచితమయిన పద్ధతిలోను ఉంచుకోవాలి.

**రాము :** నీవు సమీపింప జాలని వ్యక్తి ఎవరైనా ఉన్నారా?

**నిద్ర :** ఉన్నారు. తమ వద్దకు నన్ను రానీయని గొప్పవారు చాల కొద్దిమంది ఉన్నారు.

**రాము :** వారు దానిని ఎలా చేస్తారు?

**నిద్ర :** కొందరు తమ యోగశక్తులవలన; కొందరు తమసాధన తీవ్రత వలన, గమ్యమును చేరవలెననే బలీయమైన కోరికవలన నన్ను దూరంగా ఉంచుతారు. ఇది వారి సాధన పరాకాష్ఠా సమయంలో మాత్రమే.

**రాము :** అందరికీ నీ సన్నిధి ఎందుకు ఆవశ్యకం?

**నిద్ర :** ప్రతివ్యక్తినీ లోబరచుకొనే మూడు అవస్థలలో నేను ఒకటి, మిగిలిన రెండూ జాగ్రదవస్థ, స్వప్నావస్థ. ఈ మూడు అవస్థలు ప్రతి వ్యక్తి మీద తమ ప్రభావమును ప్రదర్శిస్తాయి. అనివార్యములు గూడ.

**రాము :** నీవు గొప్పవారిని కొందరిని ప్రస్తావించావు – వారు ఎవ్వరు? వారు ఏ స్థితిలో ఉంటారు?



**నిద్ర :** మరొక స్థితి ఉన్నది; నాల్గవస్థితియని ప్రసిద్ధమయినా అది ఒక "స్థితి" ("అవస్థ") అని చెప్పజాలము. అది ఎప్పుడూ ఉన్నది. దానిని "తురీయము" అంటారు. తురీయము ఇతరములయిన మూడు అవస్థలను అన్నిటినీ సాక్షిగా చూస్తుంది. అది ఆధారము (అధిష్ఠానం), దానిమీద ఇతరావస్థలు మూడింటికీ ఉనికి ఉన్నది. ఈ స్థితిలో నెలకొన్నవారే మహాత్ములు.

**రాము :** తురీయమనే చతుర్థస్థితిని మేము ఎందుకు అనుభవింపము?

**నిద్ర :** సాధారణ వ్యక్తులు మూడు అవస్థలకు మాత్రమే లోబడి ఉంటారు. తీవ్రమయిన సాధన పిదప సర్వవ్యాపకమై తురీయం కంటె భిన్నంకాని ఆత్మతో ఏకత్వమును పొందినప్పుడు మాత్రమే తురీయం అనుభవింపబడగలదు.

**రాము :** ఆ స్థితిని పొందటం వలన మాకేమి లభిస్తుంది?

**నిద్ర :** నీవు తురీయంలో ఉన్నపుడు మూడు అవస్థలనన్నిటినీ సాక్షిగా చూస్తావు; అనగా–నీవు ఆ స్థితిని ఆరోహిస్తే శాశ్వతంగా సాక్షిగా ఉన్న నన్ను సాక్షిగా దర్శిస్తావు.

**రాము :** నా ఫిర్యాదు ఏమంటే – జనం నిన్ను కోరనపుడు వారి వద్దకు నీవు పోతున్నావనేదే. నీవు బలవంతంగా వారిని లోబరుచుకుంటున్నావు.

**నిద్ర :** అది అలా ఉన్నట్లు కనిపించవచ్చు. నా సన్నిధిని కోరుతున్నట్లు వారు అంగీకరించకపోయినా వారికి నా అవసరమున్నపుడే నేను వారి వద్దకు పోతున్నాను. నేను వారి వద్దకు పోకపోతే వారు తాము చేసేదానిని కొనసాగింపజాలరు. తమ దేహమునకు విశ్రాంతినీ ఇవ్వజాలరు. కాబట్టి నేను వారికి ఒకవరం.

**రాము :** నీవు వారికి ఒక వరమని ఎలా చెప్పగలవు?

**నిద్ర :** సన్నిహితమయిన ప్రియవ్యక్తి వియోగం వలనగానీ విలువగల ఆస్తినష్టం వలనగానీ ఒకవ్యక్తి ఘోరమయిన దుఃఖంలో ఉన్నారనుకొందాం. అతడు గొప్ప వేదనలో ఉన్నాడు. అటువంటి స్థితిలో నేను అతని వద్దకు వెళ్ళినపుడు ఆ వ్యక్తి ఎంత ఉపశమనం పొందుతాడో! మరల ఆ వ్యక్తికి దుఃఖం కలిగినప్పటికీ ఆ వ్యక్తి ఉత్సాహంగా మేల్కొంటాడు. నేను తన వద్దకు పోవటం ఒక గొప్పవరమని ఆ వ్యక్తి భావిస్తాడు. ప్రతివ్యక్తీ నన్ను కోరుకుంటాడు; నేనూ వారిని ప్రేమపూర్వకంగా సేవిస్తాను; కొన్ని గంటల సేపు వారికి నా సాహచర్యం లభించిన తరువాత వారు చాలా హాయిగా ఉంటారు. వారు అత్యధికంగా నాకు ధన్యవాదములు తెలుపుతారు.

**రాము :** అయినప్పటికీ నీవు నావద్దకు రావటం ఒక పీడగా నేను భావిస్తాను.

**నిద్ర :** రెండు మూడు రోజులు నేను నీ వద్దకు రాను అనుకో, నీ వద్దకు నన్ను

పంపవలసినదని నీవు దేవతలందరి ఆశీస్సులను అర్థించవా! ప్రతివ్యక్తికీ నేను పీడ కాననీ చాలా ఆవశ్యకమయిన సహచరుడననీ నాకు తెలుసు. నేను పీడ అని నీవు ఎప్పుడైనా భావిస్తే నీ వద్దకు నేను రావటమును నిరోధించటానికై నీవు ఏమి చేయవలెనో నీకు చెప్పియున్నాను. అది నీ చేతుల్లో ఉన్నది. నన్ను నిందించవద్దు.

**రాము :** నీకు కృతజ్ఞుడను.

**(ముద్దబంతిపూవులో వరుస)**

**నీటిబుడగ**

**గీతం, రచన :**
**కాటమరెడ్డి సత్యనారాయణ**
**శాంతిఆశ్రమం,తోటపల్లి,**
**కాకినాడ జిల్లా**

**మీ అనుమానాలకు, పాడి వినిపించుటకు :**
**83095 98013**

జీవితమే (నీటి) బుడగరా లోకం పాము పడగరా
జన్మ వృథా చేయకు మోక్షమార్గమెదుకుమూ ఊఊ... ॥జీవి॥

సిరులు చూసి పొంగిపోకు మాయలో పడిపోకు
సగం రాత్రి సగం పగలు సరదాలతో గడపకూ
జన్మ వృధాచేసి మురిసావో నీలో దైవాన్నిచేరలేవు (లేక) దైవాన్నిచేరలేవు
ముందుగా తెలుసుకొని జ్ఞానాన్ని పొందరా ॥జీవి॥

శరీరమశాశ్వతమనీ తెలుసుకొని మసలరా
బంధాలు బంధుత్వం అంతయుమాయెరో
ఆదమరచి గడిపేస్తే జన్మవృధా అగునురా
అందుకే మేల్కొని ముక్తిని మరి పొందరా ఆత్మ శోధన చేయరా ॥జీవి॥

మనిషిగా పుట్టడమూ ఎన్నో జన్మల ఫలితమూ
ఈ జన్మలో సాధనచేసి అంతరాత్మలో కలవరా
ప్రాపంచిక విషయాలు నిన్ను మభ్యపెట్టును
నిజము తెలిసి భ్రమను మరచి నీవే దైవంగా గుర్తించు
నిన్ను నీవు తెలుసుకో అంతరాత్మలో కలిసిపో ॥జీవి

ధనంమీది మమకారం కులాసాల వ్యామోహం
సదా నిన్ను పీడించును బొమ్మలాటలాడించునూ
మరబొమ్మవు కాబోకు మనసు మాయలో పడబోకు
అసలు మర్మం తెలిసేలోపు ఒంటరిగా మిగిలేవు వార్ధక్యం ముంచురా ॥జీవి॥



## దక్షిణామూర్తి స్తోత్రం

# మానసోల్లాసం -12

**(మార్చి సంచిక తరువాయి)** **వాఖ్యాత - వింజమూరి రాధాకృష్ణ**

మార్చి నెల 2025 శాంతిపత్రికలో సురేశ్వరాచార్యుల వారు దక్షిణామూర్తి స్తోత్రములోని రెండవ శ్లోకములో శంకర భగవత్పాదుల అద్వైతాత్మక సృష్టి సిద్ధాంతమునకు న్యాయ వైశేషిక వాదులుచేసిన పూర్వపక్షము ఖండించుచు వారి వారి ప్రామాణికములను పేర్కొనిరి. ఈ పరిశీలనను మరికొంత లోతుగా చర్చించుచు సురేశ్వరాచార్యులు మానసోల్లాసంలో వివరించిరి.

**18. న్యాయైక దేశినో ఉ ప్యేవముపమానం చ కేచన**
**అర్థాపత్యా సహైతాని చేత్వార్యాహ ప్రభాకరః**

అపి=ఇంకనూ, న్యాయైక దేశినః=కొందరు సయ్యాయకులు, ఏవం=ఇట్లే, కేచన=ఇంకొందరు, ఉపమానంచ=పోలికను కూడా, ప్రభాకరః=మీమాంస కారులలో ఒక వర్గమునకు గురువు, ఏతాని=వీనిని, చత్వారి=నాలుగింటిని, అర్థాపత్యాసహ= అర్థపత్తితోనూ, ఆహ=చెప్పుచున్నారు.

నైయాకులలో కొందరు సాంఖ్యకారులు చెప్పిన ఇంద్రియ జన్యజ్ఞానము, విచారణ జన్యజ్ఞానము ఆప్త వాక్య జన్య జ్ఞానము–ఈ మూటింటినీ అంగీకరించుచుందురు. కాగా మరికొందరు ఈ మూడింటికి తోడు ఉపమానము కూడా చేర్చుదురు. మీమాంసకులలో ఒక వర్గమునకు ఆచార్యుడగు ప్రభాకరుడు అర్థపత్తి అను నాలుగవ అంశమును కూడా చేర్చినావు. అర్థపత్తి అంటే ఏదైనా ఒక కార్యము జరిగిన పిదప అందుకు కారణమేమిటి అను అంశము. ఇది ఊహాజనితముగా ఏర్పడినది.

పూర్వ మీమాంసకారులు క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దిలో రెండు వర్గములుగా ఏర్పడిరి. వీరిలో ఒక వర్గము ఆంధ్రకళింగ ప్రాంతీయుడైన కుమారిల భట్టు వర్గము కాగా మరియొక వర్గము కేరళప్రాంతమునకు చెందిన ప్రభాకర వర్గముగా ఏర్పడిరి.

**19. అభావషష్ఠానేతానిభాటావేదాంతిన స్తథా**
**సంభవైతిహ్యాయుక్తాని తాని పౌరాణికః జగుః**

భాట్టాః=మీమాంసకారులలో ఒక పక్షము వారైనా కుమారిల భట్టు అనునాయులు, తథా=మరియు, వేదాంతినః=వేదాంతులు, ఏతాని=వీనిని, అభావషష్టాని =అభావా(ఏదైనా ఒక వస్తువు లేదు అను జ్ఞానము) చేర్చి=కలిపి, ఆరింటిని, పౌరాణికాః= పౌరాణికులు, తాని=వానిని, సంభవైతిహ్యాయుక్తాని= సంభవము మరియు ఇతిహాసములతో కూడినవి, జగుః=చెప్పిరి.

మీమాంసకారులలో కుమారిల భట్టు వర్గము మరియు (అద్వైత సిద్ధాంతము అనుసరించు) వేదాంతులు అభావము లేక అనుపలబ్ధి అను ఆరవ అంశము చేర్చిరి. అభావము అనగా లేకపోవుట, పౌరాణికులు ఈ ఆరు అంశములకు అదనముగా సంభవము మరియు ఐతిహ్యములను చేర్చిరి. ఐతిహ్యము అనగా ఇతిహాసములో చెప్పబడినది.

**20. ద్రవ్యం గుణ స్తథా కర్మ సామాన్యం సవివేషకమ్**
**సమవాయం చ కాణాదాః పదార్థాన్షుత షట్ ప్రచక్షతే**

కాణాదాః=కణాదుని అనుచరులు, వైషేశికులు పదార్థాన్=పదార్ధములను, ద్రవ్యం=ద్రవ్యము, గుణః=గుణము, కర్మ=పని, సామాన్యం=సజాతీయ లక్షణము అనగా అనేక పదార్థములు ఒకే సామాన్య లక్షణము కలిగి ఉన్నప్పుడు వానిని ఒకే జాతిగా పరిగణించుట. ఉదాహరణకు మనుషులు వేరు పశువులు వేరు. సవిశేషకం= విశేషమైన బేధముతో కూడి తాము మిగిలినవాని కన్నా వేరు అనుభావము లేక ధర్మము కలిగి ఉండునవి. ఉదాహరణకు మనుషులలో స్త్రీల సమూహము, చ= మరియు, సమావాయ=ఏవేని రెండు పదార్థములు మిక్కిలి దగ్గర సంబంధం కలిగి ఉండుట, ఈ రీతిగా, షట్= ఆరు అని ప్రచక్షతే = చెప్పుదురు.

వైశేషికులు పదార్థములకు ఆరు లక్షణములు చెప్పుచున్నారు. అవి 1. ద్రవ్యము, 2.గుణము, 3.కర్మ, 4. జాతి, 5. భేదము, 6.సమవాయము.

**21. నవ ద్రవ్యాణిభూతాని దిక్కాలాత్మమనాంసి చ**
**చతుర్వింశతి రేవ స్యుర్గుణాః శబ్దాది పంచకమ్**

ద్రవ్యాణి= ద్రవ్యములు, నవ=9, భూతానిత్మ=భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అను పంచభూతములు ఇంకనూ, దిక్కాలాత్మమనాంసి=దిక్కు, కాలము, ఆత్మ, మనస్సు అను నాలుగు అంశములు గుణాః=గుణములు, స్వభావతః= స్వభావముతో, చతుర్వింశతి ఏవ,=ఇరువది నాలుగు గుణములే, స్యుః=కలిగి ఉండును, శబ్దాది పంచకం = శబ్ద స్పర్శరూప రసగంధం అను అయిదు ఇంద్రియములు.

భూమి నీరు అగ్ని వాయువు ఆకాశము అను పంచభూతములు మరియు దిక్కులు కాలము ఆత్మ మనసు అను నాలుగు చేరి ద్రవ్యములు 9 ఇవిగాక శబ్ద స్పర్శగంధములు 5 ఇంద్రియములు.

**22. పరిమాణం చ సంఖ్యా చ ద్వౌ సంయోగ విభాగకౌ**
**స్వభావతః పృథక్తం చ గురుత్వం ద్రవత పునః**



పరిమాణం=పరిమాణము, చ = మరియు. సంఖ్యా=సంఖ్య, సంయోగ విభావకౌ=సంయోగ విభాగములు, ద్వౌ= రెండు, పృథక్తం=విడిపోయి వేరుగా ఉండుట, గురుత్వం =దేశకాలములందు దూరముగా ఉండుట చ=మరియు పరిమాణము సంఖ్యా సంయోగ విభాగములు పృథక్త్వము గురుత్వము చ ద్రవత్వము

**23. పరత్వం చాపరత్వం చ స్నేహః సంస్కార ఇత్యపి ధీర్ ద్వేష**
**సుఖదుఃఖేచ్ఛా ధర్మాధర్మ ప్రయత్న కాః,**

పరత్వం=ప్రదేశకాలమందు సమీపములో ఉండుట, స్నేహః=జిడ్డు, అపి= మరియు, సంస్కారః= సంస్కారము, ధీర్ ద్వేష దుఃఖేచ్ఛ, ధర్మాధర్మ ప్రయత్నకాః= బుద్ధి ద్వేషము సుఖము దుఃఖము ఇచ్ఛా ధర్మము అధర్మము ప్రయత్నం ఇది. =అని

పరత్వము స్నేహము సంస్కారము బుద్ధి ద్వేషము సుఖము ఇచ్ఛా ధర్మము అధర్మము ప్రయత్నము ఇవన్నీ కలిపి ఇరవై నాలుగు గుణములు. ఈవిధముగా ఇరువది నాలుగు గుణములను వీరు గుర్తించిరి.

**24. సంస్కారస్త్రి విధో వేగ ఇష్వా దేర్గతి కారణమ్**
**దృష్ట శ్రుతానుభూతార్థ స్మృతి హేతుశ్చ భావనా.**

సంస్కారః= సంస్కారము, మూడు విధములు, ఇష్వాదేః=బాణము మొదలైన వాని, గతి కారణం=గమనకుమనకు కారణమగు, వేగః= వేగము, చ=మరియు, దృష్టశ్రుతానుభూతార్థ స్మృతి హేతుః=కన్నా మిన్న లేక స్వయంగా అనుభవించిన విషయము యొక్క స్మరణకు కారణముగాc భావనా=భావించుట.

సంస్కారమను గుణము మూడు విధములుగా యున్నది. అవి 1. విడిచిన బాణాలు యొక్క గమన కారణమగు వేగము. 2. స్వయముగా కనిన లేక వినిన లేక అనుభవించిన విషయముల స్మరణకు కారణమగు భావన...

**25. స్థితిస్థాపకత నామ పూర్వస్థితి కారణమ్**
**అకృష్ట శాఖాభూ ర్జాదౌ స్పష్టమేవో ప లక్ష్యతే**

స్థితిస్థాపకత నామ=చ(స్థితి స్థాపకత అనునది, పూర్వస్థితి కారణం=తాను ముందుగా ఉన్న స్థితిని పొందుటకు కారణమైన గుణము, అకృష్ట శాఖాభూర్జాదౌ= క్రిందికి లాగబడిన మఱ్ఱిచెట్టుకొమ్మ బూర్జ్యపత్రాల యందు, స్పష్టమేన= స్పష్టముగానే, ఉపలభ్యతే= కనిపించును.

పైనచెప్పిన సంస్కారము యొక్క మూడవ గుణం 3. పూర్వము తానున్న స్థితిని పొందించు స్థితిస్థాపకత శక్తి అను గుణము, బూర్జ్యపత్రాలు కోయుటకు కొమ్మను వంచి పత్రాలు కోసుకున్న పిదప కొమ్మను వదిలినప్పుడు అది పూర్వస్థితిని పొందును.

# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

(గత సంచిక తరువాయి)

## గుర్వనుగ్రహము

**అజ్ఞానము వలన, ప్రబలమగు మాయామోహము వలన సంభవించెడి (పుణ్యపాప) కర్మద్వయముచే సంసారబద్ధులై యున్నవారు దుఃఖముల పాలు అగుచున్నారు. తమ బాధ్యతను స్వీకరించిన గురువుయొక్క అనుగ్రహము కొఱకై వారిలోగల తీవ్రేచ్ఛయే, గురువుపై గల భక్తి భావనయే వారి మనోవ్యధను దూరము చేయగల ఔషధము.**

అజ్ఞానము వలన ప్రబలమగు మోహము వలన జనులందరూ కూడ తమ స్వరూపమేదో తెలుసుకొనలేక వ్యామోహపడుచున్నారు. దాని వల్ల నేను సుఖంగా, హాయిగా వుండాలని ఏవేవో పనులు చేస్తుంటే, కొన్ని పాపపుణ్యాలు చేయడం వలన వాటి ఫలితాలు అనుభవించవలసి వస్తుంది. వాటిని అనుభవించడానికి మళ్ళీ జన్మనెత్తాలి. నిరంతరం జననమరణ చక్రంలో సాగుతూ ఉంటారు. మనుష్యుల స్వభావం, పుణ్యముయొక్క ఫలాన్ని (సుఖాన్ని) కోరుకుంటారు, కాని పుణ్యం చేయరు. పాపఫలితాన్ని (దుఃఖాన్ని) కోరుకోరు, కాని పాపాన్ని మాత్రం ప్రయత్నంతో చేస్తూ ఉంటారు. రజో, తమో గుణప్రభావాల వలన, అరిషడ్వర్గాలు వుండడం వల్ల పాపం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సత్వగుణం తక్కువగా వుండడం వల్ల పుణ్యకర్మలు ఎక్కువగా చేయలేకపోతారు. అందువలన సుఖం తక్కువగా ఉంటుంది. కాబట్టి మనుష్యులకు సుఖంకన్నా దుఃఖమే ఎక్కువగా ఉంటుంది. దుఃఖాన్ని తగ్గించు కోవడానికి దేవాలయములను, గురువులను, భగవంతుడిని ఆశ్రయిస్తారు. వారి శ్రద్ధను, స్వరూప స్వభావాలను గుర్తించి గురువువారికి ఉపదేశం ఇస్తారు. ఆ గురూపదేశమును సాధన చేసి ఆత్మానందమును పొందుతాము.

ఎవరయితే తనని ఆశ్రయించి ఉంటారో, ఎవరికయితే ఇచ్ఛ ఉంటుందో, ఎవరయితే శాంతి కోసం నిజంగా పరితపిస్తారో, ఎవరికి గురువు మీద విశ్వాసం ఉంటుందో, ఎవరు మోక్షం కోసం పరితపిస్తారో వారిమీద గురువుకు అనుగ్రహం కలుగుతుంది. వారి అనుగ్రహం చేత మనకు సాధనలో వచ్చే ఇబ్బందులన్నీ తొలగి పోతాయి. సాధరణంగా జనులకు భగవంతుని మీద భక్తి ఉంటుంది కాని గురువు మీద అంత భక్తి ఉండదు. గురువు కూడా మనలాంటి మానవుడే కదా అనే భావన ఉంటుంది. కాని భగవంతుని మీద ఎంత భక్తిచూపిస్తామో, గురువు మీద కూడా అంత భక్తి చూపించగలిగినవాడే నిజమయిన శిష్యుడు. అటువంటివారి మీద గురువుకు అనుగ్రహం కలుగుతుంది. గుర్వనుగ్రహంతో లౌకిక కష్టాలు తీరి, శిష్యులు



ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్ళి శాంతిని పొందగలుగుతారు. మనిషియొక్క మనోవ్యధను దూరం చేయగలిగేది గుర్వనుగ్రహం మాత్రమే. వారి దుఃఖాలకు గుర్వనుగ్రహమే దివ్యౌషధము.

**వాసనాజనిత రాగద్వేషములచే ప్రేరేపింపబడిన వ్యాపారముల నుండి పతనమునకు దారితీయుచు భక్తుల యొక్క పుణ్యపాప కర్మములు పుట్టుచున్నవి. కర్మవేగవశమున కొట్టుమిట్టాడుచు, తన్ను ఆశ్రయించిన అట్టివారి దుఃఖమును అంతముచేసి, వారికి మోక్షానందమును ప్రసాదించునట్టివాడే సద్గురువు.**

అనేక జన్మలనుండి చేసిన పుణ్యపాపకర్మలు వాసనలుగా హృదయాన్ని చేరుతాయి. మళ్ళీ వాటిద్వారా ప్రేరేపింపబడి పుణ్యపాపకర్మలు చేస్తూ ఉంటారు. ఇలా చక్రపరిభ్రమణలో దుఃఖాన్ని అనుభవిస్తున్నవారికి గురువు అనుగ్రహం పంచి మోక్షాన్ని ఇస్తారు. కనుక గురువు అనుగ్రహం చాలా ముఖ్యమయినదని భగవాన్ చెబుతున్నారు.

**గురువు యొక్క దృష్టి తుప్పుపట్టియున్న ఇనుమువంటి జీవులను శుద్ధాత్మ స్వరూపమనెడి బంగారముగా మార్చివేయగలదు కనుక ఆ గురుదేవుని అనుగ్రహ వీక్షణము పరుసవేది వంటిది. దృష్టి మాత్రమున అది మార్పు తీసుకొని రాగలదు. కనుక నీ దోషములన్నింటిని నిర్మూలించుటకై అన్వేషించి, ఆయన అనుగ్రహ వీక్షణ ప్రసారమునకై ఆయనను పూజింపుము.**

గురువు యొక్క దృష్టి పరసువేది వంటిది. అది ఇనుమును బంగారము చేయును. గురువు అనుగ్రహంచేత, కటాక్షవీక్షణము చేతమాత్రమే మనలో శాంతి కలుగుతుంది. భగవాన్ దగ్గరకు వచ్చినవారందరూ శాంతిని పొందారు. ఆయన సమీప సన్నిధిలోనే భక్తులకు ఎంతో ప్రశాంతత లభించేది. గురువుయొక్క చూపుల వల్లనే మనలో ఎంతో మార్పు వస్తుంది. దుఃఖం తొలగి శాంతి లభిస్తుంది. చక్కని ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే అవకాశం దొరుకుతుంది. గురువుయొక్క అనుగ్రహ వీక్షణం కొఱకు మనం గురువును భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి.

**స్వరూపముగా నెలకొనియున్న గురువు జ్వలించుచున్న (ఆత్మ) జ్యోతి. ఆ జ్యోతి లోకములోని భౌతిక జ్యోతులను (సూర్యచంద్రాగ్నులను) సైతము ప్రకాశింప జేయగలుగునట్టిది; అసత్యమును సత్యముగా భావించి దుఃఖించువారికి అభాస సత్యమును అసత్యముగా వెల్లడి చేయగలుగునట్టిది.**

గురువంటే ఆత్మ. అది దివ్యమైన వెలుగు. జ్ఞానస్వరూపము. ఆనందస్వరూపము. ఆత్మయొక్క మాయాశక్తి చేతనే ఈ సృష్టిఅంతా జరిగింది. ఆత్మ అంటే జ్యోతి స్వరూపము, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఆత్మయొక్క వెలుగువల్లనే

ప్రకాశిస్తున్నాయి. ఆత్మ దివ్యమైన భవ్యమైన జ్యోతి. మనకు కనబడే ఏ వెలుగు అయినా భౌతికమయిన సూర్యచంద్ర నక్షత్రాల నుండి వస్తుంది. కాని ఆత్మని మాత్రం ఇవన్నీ ప్రకాశింపచేయలేవు. మెఱపుతీగకాని, అగ్నికాని పని చెయ్యవు. అసలు ప్రకాశించేది అంటూ వుంటే అది ఆత్మే. దానివెలుగులో అన్నీ వెలుగుతాయి కాని వాటికి స్వయం ప్రకాశక శక్తిలేదు. **నతత్ర సూర్యోభాతినచంద్రతారకం నేమా విద్యుతోభాంతికుతోయమగ్నిః తమేవ భాంత మనుభాతిసర్వం తస్యభాసా సర్వమిదం విభాతి॥** నీవే ఆత్మజ్యోతివి. ఆ సంగతి తెలియక నీవు ఈ శరీరమే నేననే భ్రాంతిలో, ఈ ప్రపంచంలో నీ సుఖం, శాంతి, ఆనందం కోసం పుణ్యాలు పాపాలు చేస్తున్నావు. నీ అసలు స్వరూపము జ్యోతి స్వరూపము, ఆనంద స్వరూపమని తెలుసుకోమని గురువు మనకు బోధచేస్తారు. ఆ బోధ వలన మనము సాధన చేసి ఆత్మానుభవమును పొందుతాము. గురువు మన స్వరూపమేమిటో మనకు చెబుతారు. అది గుర్వను గ్రహం వల్లనే సాధ్యమవుతుంది.

**సత్యజ్ఞాన ప్రదాత అయిన గురువు, 'గురువు' అనుగ్రహాకాశ వైభవము. జీవుడు 'లఘువు' గా ఉన్న రూపము. 'దేహమే నేను' అనెడి అహంకారము, అల్పునిగా, దోషదూషితునిగా దుఃఖించుచున్న రూపము. గురువు జీవుని 'లఘు' స్వరూపమును పూర్తిగా నశింపజేసి, వానిని జ్ఞానములో ఐక్యమొనర్చును. జ్ఞానమే గురువు యొక్క పరిపూర్ణ సత్యస్వరూపము.**

వ్యావహారికములో గురువు అంటే పెద్దది, లఘువు అంటే చిన్నది. గురువు అనే పదానికి అర్థము చాలా పెద్దదని. గురువు అంటే అంతులేని అనుగ్రహస్వరూపము. ఈ శరీరమే తానని, తనను తాను చిన్నబుచ్చుకొనువాడు లఘువు (శిష్యుడు) నేను అల్పుణ్ణి, శరీరానికి పరిమితమయినవాడిని, శాంతికొరకు నేనేమి చేయాలి వంటి రకరకాలయిన, భిన్న భిన్న భావాలతో దుఃఖిస్తూ వుంటాడు. శిష్యునియొక్క లఘు స్వరూపాన్ని గురువు పూర్తిగా నశింపచేస్తాడు. గురువు మనకు మన అసలు స్వరూపాన్ని చెబుతారు. గురువు యొక్క జ్ఞానము అనే భావాల చేత శిష్యునికి తాను చిన్నవాడిని, పరిమితుడిని అనే లఘుతనం (చిన్నతనం) పోతుంది. శిష్యుని అహంకారం గురువుయొక్క జ్ఞానములో ఐక్యమయిపోతుంది. గురువు స్వరూపమే ఆత్మ. జీవునిలో వుంటే అహంకారం ఆత్మలో ఐక్యమయిపోతుంది. గురువు యొక్క అసలు స్వరూపము జ్ఞానము.

**ప్రశ్న:-** ఆత్మసాక్షాత్కారము పొందుటకు గురువు ఎంతకాలము అవసరము?

శిష్యుడు తనకు తాను పరిమితునిగా భావించి, తన కష్టాలు తీరడానికి ఈశ్వరారాధన చేస్తాడు. ఆ ఆరాధనతో ఈశ్వరునికి దయకలిగి అతనికి ఒక



గురువును చూపిస్తాడు. శాస్త్రప్రకారము, మన మీద భగవంతునికి నిజమైన అనుగ్రహం కలుగడమంటే మనకొక సద్గురువును ఇవ్వడమే. భౌతికసంపదలు కావు. సద్గురువు సాంగత్యంలో మనలో వాసనలు దూరమవుతాయి. గురువు ఆశీస్సులతో బోధను అనుసరించడం వలన మనలోని దోషాలు పోయి, మన స్వరూపమయిన ఆత్మ అనుభవంలోకి వస్తుంది. గురువు వల్ల మనం ఈ సంసార సాగరం నుండి బయటపడతాము. మోక్షాన్ని పొందుతాము. భగవంతుడు మనకు చేసే అతి గొప్ప మేలు ఒక గురువును ఇవ్వడమే!

## సుఖం ఇవ్వదు

ఆలోచన నుంచి,
జీవించి
జీవితాన్ని
అంచనా
వేసుకుని
జీవితమెట్లులు
ఎక్కిన వ్యక్తి,
ఏ గంధ్రాలు,
ఏ పుస్తకాలు
చదివిన
వ్యక్తి కాదు,
ఆలోచన నుంచి
బాట వేసుకొని
బాటను
సరిచేసుకొని
జీవితాన్ని
సరిదిద్దుకొని
నడిచిన వ్యక్తి,
ఆటుపోటులను
ఎదుర్కొని
స్థిరమైన
నిర్ణయాలు
తీసుకుని
అనుకున్నది
సాధించిన
నిరంతర
బాటసారి
ఈబాటసారి
ఏగ్రంధాలు
ఏ పుస్తకాలలో లేని
జీవిత సత్యాలు
బోధిస్తూ ఉంటాడు
ఇలాంటి
అన్వేషకుడుతో
కొంత సమయం
గడుపుతే
డబ్బు సుఖం
ఇవ్వదు
జబ్బు
ఇస్తుంది
అన్నది
అర్థమవుతుంది

**మలిశెట్టి**
**శ్రీనువాస రంగారావు**
**(బన్ను)**

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

**తదా మహావాద్యఘోషా నినేదుర్మంటపాంగణే ।**
**ననృతుర్వారనార్యశ్చ జగుర్మాగధవందినః ॥ 320**

**నటా మంగళాగీతైశ్చ తుష్టువుస్తే మహాస్వన్యైః।**
**తదాదానాన్యనేకాని చక్రతుస్తౌ నృపోత్తమౌ ॥ 321**

**అథ తే బాలకాః సర్వే వధూః స్థాప్య కటీషు వై।**
**కౌలస్యాదివనితాభిర్జగ్ముస్తే భోజనగృహాన్ ॥ 322**

**తత్రాశ్రమసింజనం చక్రుః సంపూజ్య త్వాం చ మామపి ।**
**తతో రామాదికాః సర్వే స్వస్వపత్న్యా పృథఙ్ముఖాః ॥ 323**

**చక్రుస్తే భోజనం హృష్టాః స్త్రీభిస్సర్వత్ర వేష్టితా ।**
**రాజా దశరథశ్చాపి సుహృద్భిశ్చ నృపోత్తమైః ॥ 324**

**పౌరైర్జానపదైరిష్టైః మునిభిః పరివారితః।**
**జనకస్య గృహం గత్వా చకార భోజనం ముదా ॥ 325**

**కౌసల్యాద్యాః స్త్రియః స్త్రీభిః చక్రోర్భోజనముత్తమమ్ ।**
**సుమేధయా ప్రార్థితాస్తా వందితాశ్చ ముహుర్ముహుః ॥ 326**

**ఏవం నానాసముత్సాహం శ్చకారజనకోముదా ।**
**అథ తే బాలకాః సర్వే స్త్రీవాక్యాన్మాతృసన్నిధౌ ॥ 327**

**స్వస్వపత్న్యాః పాదయోః స్వశిరోభిర్నమనం ముహుః**
**చక్రుస్తుష్టచేతసస్తే తాస్తా నేముః పృథక్ పృథక్ ॥**
**కుంకుమాంకితపాదాశ్చ తేషామంకేషు తా దదుః 328**

అంత ఆ బాలకులు తమ నూతన వధువులను నడుములపై ఎక్కించుకుని సర్వజనానందముగా కౌసల్యాది సమూహముతో భోజనగృహమునకు వెడలిరి. ఓ సర్వమంగళా! అచట నిన్ను నన్నూ గూడ పూజించి, ఆశ్రమసించనమను శుభకర్మమును ఒనరించిరి. అంత శ్రీరామాదులందరును, తమతమ పత్నులతోడ అంతట కన్యామణులు చుట్టూ చేరగా వేర్వేరుగా గూర్చుండి, సుభోజనములు ఆరగించిరి. మహారాజగు దశరథుడు రాజేంద్రులగు మిత్రులతోడను, మునులతోడను పరివృతుడై జనక మందిరమున భోజన విధానముచే ఆనందించెను. కౌసల్యాది రాజస్త్రీలు స్త్రీ



పరివారముతో జనకపత్ని 'సుమేధ' చే అడుగడుగునకును ప్రార్థింపబడుచు, ఉత్తమభోజనములు ఒనరించిరి. (325) ఇట్లే జనకుడు ఉత్సాహమహోత్సవములను సలుపుచుండెను. పిమ్మట ఆ బాలకులందరును మాతృసన్నిధానమున స్త్రీవాక్య లాలితులై తమ పత్నీ పదారవిందములకు తమ ఉత్తమాంగములను ఒత్తుచుండిరి. వేర్వేరుగా ఆ వధువులను సంతుష్ట చిత్తులై పతులపాదములకు ప్రణమిల్లుచుండిరి మరియును తమ కుంకుమాంకిత చరణాంకములనుపతుల అంకములకు అలంకరించుచుండిరి. త్రైలోక్య చూడామణియును, సర్వాత్మకుడును, వరదివ్య సుందరాంగుడును, ముక్తాహారవిరాజమాన కంధరుడును, కరుణాకల్లోలిత కటాక్షుడును, పసుపు పచ్చని వస్త్రములు ధరించిన శ్రీరామచంద్రుడు మూలప్రకృతియై, జగన్మాతయైన భూపుత్రిని చేపట్టి, ముల్లోకములలో అనుపమయిన కాంతినొంది, సీతాకాంతుడనుటచే లోకాకాంతుడై రాజిలుచుండె. నాలుగవవాడు రాత్రి రాఘవాదులు వేణు పాత్ర విరాజిత దీపముల నీరాజనములచే విరాజిల్లుచుండిరి. అపుడు శ్రీరామాదులకు జనకుడు మహారాజార్హ సంమాన వస్తువులు అనగా-లక్షలకొలది మదించిన ఏనుగులను, అట్లే పల్లకీలను, పదిలక్షల గుఱ్ఱములను, లక్ష రథములను, పలు రకములగు అలంకార వస్త్రములు మొదలుగువానిని సమర్పించెను. (330)

**శ్రీరామస్సమవాప్య భూమితనయామాద్యాం జగత్స్వామినీమ్**
**సర్వాత్మా వరహేతుసుందరతనుః కారుణ్యపూర్ణేక్షణః**
**విద్యుద్వర్ణవిరాజమానవసనస్త్రైలోక్యచూడామణిః**
**శోభామాప జగత్త్రయేఽ ప్యనుమపాం ముక్తావిరాజద్గళః 329**

**చతుర్థే దివసే రాత్రౌ వంశపాత్రవిరాజితైః**
**దీపైర్నీరాజితాః సర్వే విరేజూ రాఘవాదయః ॥ 330**

**రామాదీనాం పారిబర్హాన్ దదౌ స జనకస్తదా ।**
**నియుతాన్ వారణేంద్రాశ్చ శిబికాశ్చాపి తన్మితాః ॥ 331**

**తురగాన్ దశలక్షాంశ్చ నియుతాన్ స్యందనాన్దదౌ**
**నానాలంకారవాసాంసి గోదాసీసేవకాదికాన్ ॥ 332**

**దదౌ స రాఘవాదిభ్యో యేషాం సంఖ్యా న విద్యతే ।**
**ఏవం సంమానితాస్తేన తే బాలే జనకేన హి ॥ 333**

**పూర్వవదుత్సతాద్యైశ్చ స్వస్వపత్న్యా సమన్వితాః**
**గజారూఢా నృత్తగీతైః తాభిః స్వమంటపం యయుః ॥ 334**

తతో రాజా మాసమేకం నినాయ నృపవాక్యతః ।
తతః సైన్యేన స్వపురీం గంతుం పుర్యా బహిర్యయౌ ॥ 335

సీతాద్యా నిర్యయుర్ముగ్ధాః సాశ్రునేత్రాః సువిహ్వలాః ।
సుమేధాస్తాః సమాలింగ్య సాంత్వయిత్వా వ్యసర్జయత్ ॥ 336

అథ రాజా దశరథో జనకం విన్యవర్తయత్ ।
తదా దశరథం ప్రాహ జనకః సాశ్రులోచనః ॥ 337

శ్వసన్నవోష్ణమ్లానాస్యో విరహోద్గద్గదాక్షరః ।
ఏతావత్కాలపర్యంతం సీతాద్యా లాలితామయా ॥ 338

అధునా త్వమితాస్త్వగ్రే లాలయంబ కృతేక్షణైః
ఇత్యుక్త్వా నృపతిం నత్వా మిథిలాం జనకో యయౌ ॥ 339

తతో దశరథశ్చాపి స్నుషాస్త్రీతనయాదిభిః ।
నృపైః సైన్యేన స్వపురీం యయౌ మార్గే శనైః శనైః ॥ 340

ఇట్లు లెక్కలేనన్ని దివ్యవస్తువులనిచ్చిన జనకునివలన ఆ బాలకులు సంమానింప బడుచుండిరి. యథాపూర్వకముగా మహోత్సవములను చేసికొని, తమ పత్నులతోడ గజస్కంధములనెక్కి, నృత్తగీతాది వినోదములు పొందుచు, విడిది ఇంటికి వచ్చిచేరిరి. అంతట నిట్లే ఒక నెల అమందానందముగా మిథిలానగరమున దశరథ మహారాజు, జనకమహారాజు ప్రార్థనను అంగీకరించి వసించుచుండెను.

**సీత అత్తవారింటికి పోవుట**

కొద్దికాలము తరువాత జనకపురి నుండి సైన్యములతో అయోధ్యకు ప్రయాణము చేయనెంచెను. మిథిలా రాజధానిని విడిచివచ్చునపుడు ముగ్ధలయిన సీత, ఊర్మిళ, మాండవీ, శ్రుతకీర్తులు మనమున కలతనొంది, బాష్పాకులిత నేత్రులై యుండ సుమేధాదేవి వారిని సమాలింగనాది ఓదార్పులచే సమాధానము చేయుచుండెను. అపుడు జనకరాజు సాశ్రులోచనుడై మోమువాడుచుండ, నిట్టూర్పులు వెడలుచుండ, గద్గదస్వరమున దశరథునితో ఇట్లనియె, "ఈవరకు సీతయు మొదలయిన వీరు నాచే లాలనతో పాలింపబడుచుండిరి, ఇకమీదగ మీరు దయాదృష్టులతో పాలింప నగును. అని అందరును సీతారామాది వధూవరులను సపరివారముగా సాగనంపి, మిథిలకు తిరిగి వచ్చిరి. అంత దశరథుడు, కోదండ్రు మొదలైన యిల్లాండ్రతోను, రాజులతోను, పుత్రులతోను, సైన్యపరివారముతోను, అయోధ్యకు తిన్నగా బయలుదేరెను. (340)




# FORM-IV

(SEE RULE - 8)

| | | |
|---|---|---|
| 1. Name of the Magazine | : | SANTI (Telugu Monthly) |
| 2. Place of Publication | : | The Mission of Peace Sri Santi Ashram, Via Sankhavaram, Thotapalli, Kakinada Dist. 533 446. A.P. |
| 3. Periodicity of the Publication | : | Quarterly |
| 4. Printer's Name and address | : | Partners Sri G.V. Rao and Sri. G.V. Madhu Mohan, Mohan Graphics, D.No. 12-1-40, Jawarhar Street, Kakinada–533 001. Kakinada Dist. A.P. |
| Whether Citizen of India | : | Yes |
| (if Foreigner, State the Country of Origin) | : | Not Applicable |
| 5. Publishers Name | : | M.V.V. Satyanarayana |
| Whether Citizen of India | : | Yes |
| 6. Editor's Name | : | Swamini Vinamrananda |
| 7. Address | : | The Mission of Peace, Sri Santi Ashram, Via Sankhavaram, Thotapalli, Kakinada Dist. -533 446. A.P. |
| 8. Name and address of Individuals who own the paper and more than one Percent of the total capital | : | The Board of Trustees and the Committee of Management of The Mission of peace, Sri Santi Ashram, (Regd). Sri Santi Ashram Post, Via Sankhavaram Kakinada Dist., A.P. – 533 446. |

I, **M.V.V.Satyanarayana**, Publisher, The Mission of Peace, Sri Santi Ashram, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**M.V.V.Satyanarayana**
Publisher
The Mission of Peace,
Sri Santi Ashram

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 30-04-2025 (బుధవారం):** అక్షయతృతీయ సందర్భంగా తోటపల్లి ఆశ్రమంలో ఉ॥7.00లకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి అష్టోత్తర శతనామార్చన జరుప బడును.

## దైవసాయుజ్యం

ది. 18-02-2025 మంగళవారం నాడు శ్రీ అద్దేపల్లి రామ్మోహన్ రావు గారు పుటపర్తినందు దైవసాయుజ్యం పొందారు.

వీరు ఆశ్రమ శ్రేయోభిలాషులు చిరకాల భక్తులు, శాంతి ఆశ్రమంలో అనేక సంవత్సరములు నివశించి అనేక అన్నదానం, విద్యాదానం, గృహవసతి దానములు చేసి అనేక కార్యక్రమములకు సహాయ సహకారములందించిన ధన్యజీవి. వీరు లేని లోటు మరువలేనిది, వీరి ఆత్మశాంతికి ఆశ్రమంలో ప్రార్థనలను చేసిరి. వీరి పేరున ది.28-02-2025న అన్నదానం చేయబడినది. వీరి కుటుంబానికి శాంతి కలగాలని గురుదేవులను ప్రార్థించడం జరిగింది.

పండ్లతో బరువెక్కిన చెట్లు నేలకు వంగివున్నట్లే గొప్పవాడు కాదల్చుకున్న వ్యక్తి వినయం, అణుకువ కలిగియుండాలి.

**-రామకృష్ణ పరమహంస**

పండిన ఆకులు చెట్టునుండి ఏవిధంగా రాలిపోవునో అదే విధముగా ఆయువు తీరినవాడు మరణింతురు. దానికై దుఃఖించుట ఎందుకు?

**-స్వామి శివానంద**

వాసనల నుండి తప్పించుకున్నవాడే జ్ఞాని

**-శ్రీ రమణ మహర్షి**

**ఆత్మజ్ఞానం:** నిన్ను నువ్వు తెలుసుకో గలిగిన రోజు భగవంతుణ్ణి తెలుసు కోగలవు. 'నేను' అనేది ఏది? చెయ్యా, కాలా, మాంసమా, రక్తమా లేక శరీరంలోని మరేదైనా భాగమా? బాగా ఆలోచించండి, 'నేను' అనేది ఏదీ లేదని నీకే తెలుస్తుంది. నీరుల్లిపాయ పొరలను ఒలచినకొద్దీ పొరలు వస్తూనే ఉంటాయి; కాని పలుకు అనదగినదేది కనపడదు. అలాగే అహంకారం యొక్క స్వరూపం ఏమిటి? అని పరిశోధించినప్పుడు అది అదృశ్యమైపోతుంది. చివరకు మిగిలేది ఆత్మే. చిత్స్వరూపమే. అహంకారం నశించగానే భగవంతుడు సాక్షాత్కరిస్తాడు.

**-శ్రీ రామకృష్ణ పరమహంస**



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్స రముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

## విరాళములు

1. శ్రీమతి నడిపిల్లి సత్యభావ్యశ్రీగారు (మురమళ్ళ)
   విద్యాఖర్చుల నిమిత్తం 5,000/-
2. శ్రీమతి వి. అరుణాదేవి గారు (విశాఖపట్నం) 3,021/-
3. శ్రీమతి శశికళా పట్నాయక్ గారు (విశాఖపట్నం) 7,011/-
4. శ్రీమతి సీతామహాలక్ష్మి, విజయలక్ష్మి గార్లు (హైదరాబాదు) 3,000/-
5. శ్రీ కె. కృష్ణమూర్తి గారు (విశాఖపట్నం) 9,000/-
6. శ్రీమతి పి.లక్ష్మి గారు (శాంతి ఆశ్రమం), బిల్డింగు రిపేర్సు నిమిత్తం 20,000/-
7. డా|| సి.కేశవరావు గారు (కాకినాడ), విద్యానిధి నిమిత్తం 50,000/-
8. శ్రీమతి సి.హెచ్.అనసూయమ్మ గారు (హైదరాబాదు) 3,000/-
   మహాశివరాత్రి సందర్భముగా

## శాశ్వతఅన్నదానం

1. శ్రీమతి పి.భారతీరావు గారు (బెంగుళూరు)
   వీరి కుమార్తెగారి అల్లుడు సిద్ధార్థ తాత
   జన్మదినము సందర్భముగా 10,000/-
2. డా॥కె.లీలాదేవి గారు (తుని) వీరి తండ్రి
   లక్ష్మయ్య నాయుడుగారి జతన్మదినము సందర్భముగా 10,000/-
3. శ్రీ సందకం రాంబాబు గారు (జె.బూరుగుపూడి)
   వీరి తల్లిదండ్రులు మంగాయమ్మ అప్పారావు గార్ల
   జ్ఞాపకార్థం 10,000/-

జ్ఞానసాధన కంటే మహాభాగ్యం మరోటి లేదు.

**-శ్రీ తత్వ విదానంద**

సత్యంవద-సత్యమునే పలుకుము, ధర్మంచర-ధర్మమునే ఆచరింపుము, అధ్యయనమును మానకుము.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, తల్లియే దైవము, తండ్రియే దైవము, ఆచార్యుడే దైవము, దోషములేని కర్మలనే ఆచరింపుము, అశ్రద్ధతో దానము చేయకుము. నీ శక్తికొలది దానము చేయుము.

**-సూక్తిముక్తావళి**



బ్రహ్మవిద్యకే విద్యయను నర్థము సరూఢియై యున్నది. అట్టి విద్యను పొందుటకు అనేక మార్గములున్నట్లున్నను మూడవ నేత్రమును తెరిపించు కుండలినీ విద్యయే అందరకు ఆచరణ యోగ్యమై, ఈ జన్మయందే ముక్తి నొసంగును. దానిని బాల్యము నుండియే అభ్యసించునవకాశము కల్గించు ఉపనయనము అందరకు పిల్లలకు చేసి చక్కని భావిపౌరులకు తయారు చేయవచ్చును. అది విశ్వమానవ సౌభ్రాతృత్వమునకు, విశ్వకళ్యాణమునకు తోడ్పడుననుటకు ఎట్టి సందియము లేదు.

**-సద్గురుసుభాషితం**

మనము చేయదలచుకొనిన మంచిని నేడే చేయుదము గాక!

**-ఓంకార సూక్తులు**

'మీకు యిష్టంలేనిది - ఇష్టం లేదు' అని స్పష్టంగా చెప్పండి.

**-చిన్మయ మిషన్**

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,<br>పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS


1. Auto Biography of swami Omkar (2 Volumes) ................ Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar ................ Rs. 10/-
3. Soham ................ Rs. 10/-
4. Cosmic Fast ................ Rs. 20/-
5. Meditation ................ Rs. 10/-
6. Om Japa ................ Rs. 10/-
7. Control of Mind ................ Rs. 30/-
8. Cosmic Flashes ................ Rs. 10/-
9. In the Hours of Silence ................ Rs. 10/-
10. The Soul of Omkar ................ Rs. 10/-
11. How I learned English ................ Rs. 10/-
12. Reincarnation of my Little Sister ................ Rs. 10/-
13. God Realization Now and Here ................ Rs. 10/-
14. Mystic Prayers and Poems ................ Rs. 20/-
15. The Divine Voice of Omkar ................ Rs. 40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ................ Rs. 100/-
17. Petals of Peace ................ Rs. 20/-
18. The Story of my life and Work ................ Rs. 10/-
19. Priceless legacy of Swami Omkar ................ Rs. 10/-
20. The Four Initiations ................ Rs. 10/-
21. Musings ................ Rs. 20/-
22. Peace Prayer ................ Rs. 20/-


**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda